# రాగిణి దీదీ

(కథానిక)

చేతుల్లో వారపత్రిక వుందిగాని దృష్టిమాత్రం వెనక్కి పరుగులేస్తున్న చెట్లకేసి, టెలిగ్రాఫ్ స్తంభాలకేసి జారిపోతోంది- ఎంత దూరం ముందుకు వచ్చామో అని. ఇంకెంత. గోదావరి రానేవచ్చింది, మరో నాలుగుగంటల ప్రయాణం.

బండి పరుగెడుతూంటే నాలో మెదిలేది రైలువేగం కాదు, ఎంత త్వరలో బెజవాడ వచ్చేస్తుందా అనే ఉద్వేగం. వెళ్ళిన వెంటనే ముందుగా రాగిణిని కలుసుకోవాలి. రాగిణి అంటే చాలు, శరీరమంతా చెప్పలేని పులకరింతతో ఝల్లుమంటోంది.

బండి వంతెనమీదకి వచ్చింది. స్తంభాల మొగల్లో నది సుళ్ళుతిరుగుతోంది. దూరాన ఆనకట్ట, గోదావరీ నదీమతల్లిని ఆకాశంతో కలుపుతున్నట్టు, తిన్నగా ఓ రేఖని నది ఉపరితలం మీద సృష్టించింది. బంగారు నక్షత్రాలు నదీ తరంగాల్లో తళుక్కుమంటున్నాయి.

కింద ప్రవహిస్తున్న నదిని చూడగానే పాట జ్ఞాపకానికివచ్చి, అప్రయత్నంగా పాటని నోట్లోనే మెల్లగా రాగంతీసాను.

'గలగలా గోదావరి కదలిపోతుంటేను-'

నేను వెళ్ళేది బెజవాడ గనుక ఎక్కువ ఉత్సాహంతో 'బిరబిర క్రిష్ణమ్మ పరుగులెడుతుంటేను' అని పాడుకొంటూ నాలో నేనే పులకితుణ్ణైపోతున్నాను.

నా పరవశత్వానికి కారణం పాటకాదు, నదీమతల్లీ కాదు, రాగమూ కాదు- విజయపురిలో ఐదేళ్ళనించి కాపురముంటున్న నా రాగిణీ దీదీ సుకుమార సుందరవదనం, ఆమె కొడుకు 'బాబు' చిల్లుబుగ్గల బోసినవ్వు!

బుడతడు ఈపాటికి చాల పెద్దవాడై ఉంటాడు. చదువుకొంటుంటాడు కూడ. నన్ను చూడగానే మావయ్యా అంటూ ఎగబాకిపోతాడు కూడా! ఇక వాడి సంతోషం ఆనందం చెప్పలేను. నాలో నేనే చిరునవ్వు నవ్వుకొంటున్నాను.

కాని వాడికి ఒక్క సంవత్సరమైనా, దాటకుండా వాళ్ళు రాజమండ్రి వదిలేశారే! అంత చిన్నతనంలో వెళ్ళిపోయిన బాబు నన్నిప్పుడు గుర్తుపట్టగలడా? నన్ను చూసి ఏ పరాయివాడో అనుకొంటాడు. తల్లి ఒళ్లో దాగుండిపోతాడు. కాని రాగిణి చెప్పగానే గుర్తుపడతాడు. ఇక నాకు మంచి స్నేహితుడు కూడ ఐపోతాడు.

కొవ్వూరు వొచ్చింది బండి కూడ కదిలిపోయింది. నాకది గుర్తులేదు. ఏలోకంలో వున్నానో! ఆ ఇనుపచక్రాలు దొర్లేకొద్దీ బెజవాడ రాకకి ఒక్క నిముషమే తగ్గుతుందనే సంతోషం! రైలుకి రెక్కలున్నా బాగుణ్ణు.

నా భుజాలు పట్టుకొని నన్నెవరో వూపేంతవరకూ నేను తేరుకోలేకపోయాను. పక్కకి చూశాను. పెట్టెలోని ప్యాసింజర్స్ అంతా ఒక్కసారి ఫక్కుమన్నారు. దెబ్బకి నా మత్తు వొదిలిపోయింది. పక్కకి వ్యక్తికేసి చూశాను, శేరపాణి.

'గుర్తుపట్టలేకపోతున్నా వేమిట్రా?' అని నా పక్కన కూచొన్నాడు.

'ఓహో! నువ్వేనా? డిప్ గ్లాసెస్‌లో కళ్లు దాచుకొంటె, ఎలా ఆనవాలు పట్టగలను!' అని పక్కకి జరిగాను.

'ఈమధ్యయం. ఏ ప్యాసయి కరకాయ ప్రవేశం చేర్చావేమో అనుకొన్నాను.'

'అందుకేనేవిటి ప్రయాణీకుల దరూ అలా నవ్వుతున్నారు?' అన్నాను మెల్లగా, క్రీగంట చూపుతో ప్రయాణీకులని కనిపెడుతూ.

'లోపల అడుగుపెట్టిందగ్గర్నుంచి. నిన్ను పిలుస్తున్నాను నువ్వసలు ఈలోకంలో వుంటేగా

యన్. ఆర్. నంది

పలకడానికి?' అని నవ్వుతున్నాడు ప్రకాశం.

'సరేగాని, ఎంతవరకూ ప్రయాణం?'

'ఏలూరు. నువ్వు?'

'బెజవాడ?'

'బెజవాడలో ఎవరున్నారోయ్?'

'ఉన్నారులే. రాజమండ్రిలో ఇంతకముందు మా యింటిపక్కనున్న మహారాష్ట్రులు.'

'అయితే తిండి, పడక అక్కడే నేమిటి?'

'ఆఁ. వాళ్ళింటికేనని ప్రత్యేకంగా వెడుతుంటే మరోదగ్గరెలా సాధ్యమవుతుంది?'

'నువ్వు బ్రాహ్మణవే?' అన్నాడు ఆశ్చర్యంగా.

'డాక్టర్స్‌కి బ్రాహ్మణత్వం ఓ అడ్డు కాదురా. అయినా ఈ శతాబ్దిలో యింకా ఈ వర్ణాలు, కులాలు ఎందుకురా?'

ప్రకాశం చిరునవ్వు నవ్వుకొంటూ నా చేతిలోని పత్రికని తీసి, కాయితాలు యిటూ, అటూ తిరగేశాడు. నేను ఓక్షణం వాడికేసి చూసి, తర్వాత నాదృష్టిని దాటిపోతున్న అగనగాలకేసి తిప్పాను.

'ఈమధ్య కథలు జోరుగా రాస్తున్నావ్?'

'రాత్రిలు యింకేం పనుంటుంది? బ్రహ్మచారిని. అలాగన్నా రాసుకొంటే కాస్త రిలీఫ్ చేకూరుతుంది గదా అని' అన్నాను అలానే కదలకండా.

'నువ్వు అన్నా చెల్లెలు అని ఎక్కువగా రాస్తుంటావు గదా, ప్రేమికుల తాపాలు రాయవేం మరి?'

'ప్రేమికుల విషయాలంటే నాకు ఇష్టం లేదుగాని, భ్రాతృత్వాన్ని వర్ణించడమంటే, మాతృత్వాన్ని ఉల్లేఖించడమంటే ఎక్కువ సరదా. అవి రాస్తూ నన్ను నేనే మరచిపోతాను' అన్నాను- అంటూంటే నాకు తెలియకుండా కళ్ళల్లో పరవశత్వం పరవళ్లు తొక్కింది.

'నువ్వు అన్నా చెల్లెలిని అంతదగ్గరగా కలిపి, ఒకరు లేకపోతే మరొకరు నిప్పుల్లో దొర్లేంత బాధని చిత్రిస్తావు గదా, అవి మామూలు ప్రపంచంలో ఎక్కడన్నా జరుగుతవా?'

'తప్పకండా. దురదృష్టవశాత్తూ నాకు అక్కగాని చెల్లెలు గాని లేకపోయారు. ఉండివుంటే ఇప్పటి నేనుకంటే, ఎన్నోరెట్లు ఆనందంగా వుండేవాడిని. నా డాక్టర్ డిగ్రీని చూసి నాకు సిస్టర్స్ గాని వున్నట్టయితే ఎంత పొంగిపోయేవారో!' అన్నాను మెల్లగా.

ప్రకాశం, పత్రిక కాయితాల్లో వేళ్ళాడిస్తున్నాడు, సన్నగా నవ్వుకొంటూ.

'నాకు అక్కలేని లోటుని రాగిణి తీర్చింది' అన్నాను నిట్టూర్పువిడుస్తూ. రాగిణిమాట నన్ను చెక్కిలిగింతలు పెట్టింది.

ప్రకాశం. అందుకే నేఁటి బెజవాడ వెడుతున్నావ్?- అన్నట్టు నాకేసి చూశాడు.

'నేను స్కూల్ ఫైనల్ చదువుతున్నపుడే వాళ్లు రాజమండ్రి వొదిలేశారు. అప్పటినించి ఇప్పటికి సరిగా అయిదేళ్లు! ఇప్పుడు నాకు తీరుబడి అయింది వెడుతున్నాను. నన్ను చూసి ఆనవాలు పట్టగలరా!'

'రాగిణి అంటే, అప్పుడు నువ్వు స్కూల్లో తెగపొగిడే దీదీగారేనా? గుజరాతీవాళ్లో ఎవరో అని చెప్పేవాడివి?' అన్నాడు ప్రకాశం జ్ఞాపకం తెచ్చుకొంటూ

'గుజరాతీవాళ్లు కారు మహారాష్ట్రులు. నాకు చిన్నతనంలో లెఖ్ఖలు నేర్పించేది. ఇంగ్లీషు, జాగ్రఫీ, హిస్టరీ, సైన్సు చెప్పేది. కాని ఆమెకి తెలుగు సరిగా రాదుగనక తెలుగు వదిలేసేది. ఎప్పుడూ నేను వాళ్ళింట్లోనే వుండేవాడిని. ఇహ నాకు అక్కడుంటే ఆకలి తలంపు కూడ వుండేదికాదు. ఆమె కూడ నన్ను ప్రాణంగా చూసేది. నాకంటె నాలుగేళ్ళు పెద్ద వుంటుంది' అంటున్నాను నా సంతోషంలో నేను.

'అప్పుడు నీ వయసు- అంటే మా యింటి పక్కకి వచ్చినపుడు, పదకొండు కదూ?'

'ఆఁ, ఆమెకి అప్పుడే పెళ్ళయింది. పదిహేను పదహారేళ్లున్నా, మహారాష్ట్రులు కాబట్టి ఏ ఇరవైయేళ్ళ స్త్రీలాగో అగుపించేది. నేను మొదట్లో అక్కా అనడానికి సిగ్గుపడితే 'దీదీ' అనమంది. నేను అలానే పిలిచేవాడిని. తర్వాత మూడేళ్ళకు ఆమెకి ఓ కొడుకు పుట్టాడు. ఎంత అందంగా వుండేవాడనుకొన్నావ్! వాళ్ళేదో పేరుపెట్టారు. కాని నేను వాణ్ణి 'బాబు' అని పిలిచేవాణ్ణి. ఎంత వెంకివాడను

కొన్నావ్! నన్ను జుత్తుపట్టుకొంటే అక్కడి వెంట్రుకలన్నీ అలా వూడిపోవలసిందే.'

ప్రకాశం శ్రద్ధగానే వింటున్నాడు. వాడు విన్నా వినకపోయినా నా సంతోషంలో నేను చెప్పుకపోతున్నాను. కంపార్ట్‌మెంట్ లో దీపాలు వెలిగాయి. మసకచీకటిలో మసకగా వున్న పక్కచెట్లు 'రివ్వు, రివ్వు' మంటూ వెనక్కి వూగుతూ పోతున్నాయ్.

'ఐదేళ్ళ తర్వాత యిప్పుడు నీకు తీరుబాటయిందన్నమాట వాళ్ళని చూడ్డానికి?'

'ఏం చెయ్యను, ఇంతకుముందులా మనం స్కూల్స్‌లో చదివి గంతులేసే పసివాళ్ళం కాదు. బాధ్యత తెలిగిన పెద్దవాళ్ళం. అందులో దేశానికి మూలస్తంభాలయిన ముగ్గుర్లో ఒకరైన డాక్టర్ని...'

'వయస్సెక్కువయ్యేకొద్దీ భావాలు మారుతవి కదూ!' వాడామాటని ఏ ఐడియాతో అన్నాడో!

'అవును' అన్నాను నేను నా భావనతో.

'అంతే! నువ్వు బెజవాడ వెళ్ళకపోవడమే మంచిది' అన్నాడు సీరియస్‌గా.

'ఏం!' అన్నాను ఆశ్చర్యంగా, కొంచెం బెదరి.

'కారణం: నువ్వు, ఆ రాగిణి తమ్ముడిలా చూసుకొనే పన్నెండేళ్ళ పసివాడివికావు గాబట్టి'

'అయితే మాత్రం నేను, నేనేగా?'

'అవును నీపేరు, నువ్వూ ఏమీ మారలేదు. కాని ఇంతకముందు నీలోవుండేది పసిహృదయం, ఇప్పటిది యౌవనహృదయం; ఏ భావాలనన్నా సరే వికటంగా హాస్యంచేయగల, అటు పచ్చి, ఇటు పండూ కాని మధ్యరకపు హృదయం.'

ఏమిటి వాడనేది? నా కర్థం గావటంలేదు. హృదయం మారడమేమిటి? పచ్చీ పండూ కాని మధ్యరకపు హృదయమేమిటి? వాడికేసి తేరపారి చూస్తున్నాను.

'నువ్వు బెజవాడ వెళ్ళకండా తిరిగి రాజమండ్రి పోవడమే ఉత్తమం. ఇప్పుడు నువ్వు యుక్తాయుక్తాలు తెలీని యుక్తవయసులో వున్నావు. ఆ రాగిణిని చూడగానే నువు ఇహ అక్కలా ఆమెని చూడలేవు. నీలో అదోవిధమైన సంచలనం బయలుదేరుతుంది. దాన్ని నువ్వు తర్కించుకోలేవు. గుర్తుపట్టలేవు, వ్యక్తపరచలేవు. కారణం: వాత్సల్యం, ప్రేమ ఒక్క హృదయంనించి పుట్టడంవల్లే!'

నన్ను వాడనుమానిస్తున్నాడని తెలుసుకొన్నాను. నాకు ఎందుకో వాడిమీదభయం, కోపంగూడ పుట్టాయి. వాడికంటె నేను బాగా చదువుకొన్నవాడినని, డాక్టరునని, సైకాలజీ నాకు బాగా తెలుసునని వాడికి తెలీదు లాగుంది. వాణ్ణి పీక నులిమేయాలన్నంత కోపం వచ్చింది.

మళ్ళా వాడే అన్నాడు: 'సైకాలజీ, చదివినంతలో అర్థం కాదురా. నీలో అప్పుడే కోపం ఎక్కువైపోతోంది. నే ననలేదూ, నువ్విప్పుడు యుక్తాయుక్తాలు తెలీని వయసులో వున్నావని? అందుకే. వాత్సల్యానికి, ప్రేమకి, మోహానికి మూలం ఒక్కటే. అసలు ఈ మూడూ నిజానికి ఒకటే, వేర్వేరు పేర్లతో వ్యవహరింపబడుతున్నాయిగాని. వాత్సల్యానికి వ్యక్తులనిగాని ప్రాణులనిగాని చూస్తే, లేక కనుచాటయితే, ఎంత పరవశత, మత్తు, మైకం, ఆనందం, సంతోషం కలుగుతుందో-ప్రేమ మోహాలకీ అంతే! అందుకే మనువు అనే మాటలో అంత పెద్ద అర్థం అంతర్గర్భితమయి వుంది. హృదయం పచ్చిగా వున్నప్పుడు, అందులో వాత్సల్యం, ప్రేమ; అది అలా అలా పెరుగుతున్నపుడు మోహం పుడుతుంది. ఇంకా హృదయం వృద్ధయేకొద్దీ ఇవి మూడూ విడిపోతాయి. అది కొంత సంసారిక జీవితాన్ని అనుభవిస్తేనేగాని తెలీదు. నీ వయసులో వున్న బ్రహ్మచారి హృదయం ప్రేమ, వాత్సల్యం, మోహాలకి, భేదా తెలుసుకోలేదు. ఇప్పుడు నీ హృదయం వీటన్నిటి సమ్మిశ్రమం, అందువల్ల.'

'చాల్లే వూరుకో, ఎవడికో శుంఠకి బోధిస్తున్నట్టు, దుర్బలుడికి చెప్పేట్టు చెబుతున్నావ్- అంత దుర్బలుణ్ణి కాను నేను, అంత నీచుణ్ణి కాదు' తల తిప్పేసుకొన్నాను. కిటికీల్లోంచి అగుపించే సరుగుడుచెట్లు విశ్వసమాజ హీన కాంతిలో అల్లిబిల్లిగా అగుపిస్తున్నాయ్.

'కోప మొచ్చిందా? అవును. రాదూ! హృదయదౌర్బల్యమిది అని విడమర్చి చెబితే-' అని ప్రకాశం నవ్వి నా భుజంమీద చేయి వేశాడు.

'అంత సుందరాంగిని, పోనీ నువ్వెలా అనుమానించావురా?' అన్నాను కాస్త కంఠం తగ్గిస్తూ.

'మానవనైజాన్ని మనం నిర్వచించలేం రా'

ఎందుకో అప్రయత్నంగా ఫక్కున నవ్వాను. 'నువ్వు నిజంగా ఫూల్‌వి రా'

వాడూ నవ్వేశాడు. తర్వాత ఆ మాటలని వదలి మిగత మాటలు మాటాడుకొన్నాం సరదాగా.

ప్రకాశం ఏలూరులో దిగిపోయేప్పుడు రాగిణి దీదీ గురించి ఏమీ మాట్లాడలేదు-నవ్వుకొంటూ కౌగిలించుకొన్నాడు. 'పెద్దవాళ్లమైన తర్వాత మనం ఒకళ్ళనొదిలి ఒకళ్ళం ఎంత తమాషాగా కాలాన్ని మారించేస్తాం' అన్నాడు.

'దానికికూడ ఏదో నిర్వచనాన్ని చూడు' అన్నాను నవ్వుతూ-

నేను మరో గంటలో బెజవాడలో దిగాను. అంతవరకూ నాలో తీవ్రంగా స్పందిస్తున్న ప్రకాశం మాటలు బెజవాడని చూడగానే ఎక్కడివక్కడ మాయమయాయి.

పదిన్నరయింది. ఇప్పుడా గల్లీల్లో ఎలా తిరగగలను? ఇదే బెజవాడ రావడం మొదటసారి. పోనీ వాళ్ళిల్లు ఎలానో తంటాలుపడి తెలుసుకొని వెళ్లినా, వాళ్ళంతా మంచి నిద్రలో వుంటారు. వాళ్ళ నిద్రలని చెరపడం, మళ్ళా వాళ్ళ నాకోసం పక్కలకి ప్రయత్నాలు-ఇన్ని గొడవలు లేకండా తెల్లవారేవరకూ వెయిటింగ్ రూంలో పడుకొని, తెల్లవారగానే వెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. రూంలోకి వెళ్ళి బెడ్డింగ్ పరచాను.

కళ్ళయితే మూసుకొన్నానుగాని, రాగిణి దీదీ,బాబు,నాకోసమే ఎదురుచూస్తున్నట్టు నన్ను గురించే మేల్కొనివున్నట్టు అగుపిస్తోంది.

ఆ పక్కనించి ఈ పక్కకి దొర్లుతున్నాను. నిద్రరావడం లేదు. ఎంతత్వరగా తెల్లవారిపోతుందన్న తొందరే. ఆస్తమానం చేతిగడియారంకేసి చూసుకోవడం, మళ్ళా ఆ రేడియం అంకెలు భూతాల్లా అగుపించగానే విసుక్కొంటూ కళ్లు మూయడంతోనే తెల్లవారిపోయింది.

రిక్షా ఎక్కి బయలుదేరాను. వాడెన్ని సందులు తిప్పాడో లెక్కలేదు. ఇన్ని సందులు గొందులున్న బెజవాడలో బాబు రాగిణి దీదీ ఎక్కడుంటారో! రిక్షావాడు తిప్పితిప్పి, తిరిగి తిరిగి ఎనిమిదిన్నరకి అక్కడికి చేర్పించాడు.

బయట ఓ ఆరేళ్ల పిల్లాడు ఆడుకొంటున్నాడు. వాడే బాబు అయివుంటాడనుకొన్నాను. దగ్గరకు వెళ్ళి 'నాన్నగారున్నారా?' అన్నాను.

వాడెక్కడ. మహాపెంకి-'ఎందుకు' అని ఎదిరించాడు.

అంతలోనే ఒకామె గుమ్మందగ్గర మెరుపులా తళుక్కుమంది.

ఆ కళ్ళనుబట్టి, ఆ చేతివేళ్ళనుబట్టి ఆ వాలకాన్నిబట్టి ఆమె రాగిణి దీదీ అయివుంటుందని గ్రహించాను. పదేళ్ళక్రితం దీదీ ఎలావుందో యిప్పుడూ అలానేవుంది. ఏమీ మారలేదు. అప్పుడు నేను చిన్నవాడిని గాబట్టి ఆమె అందాన్ని ఆమె సుకుమారతని, ఆమె లేనవ్వుల్ని ఆమె వేళ్ళకింద కంపించే వీణాతంత్రుల ప్రకంపనాల్లోనూ, మృదుమధుర స్వరతంత్రుల గానంలోనూ చూసేవాడిని. కాని యిప్పుడామె దీర్ఘకేశికాల్లోనూ, మృదుఫాలంలోనూ, పురిపెట్టి నలిపే ఆ కళ్ళలోనూ ముఖ్యంగా నన్ను వూపి కదలిస్తున్న ఆమె శరీర లావణ్యంలోనూ చూశాను. పరవశమైపోయాను. నా కళ్లల్లోనే మెరిసాయి సహస్రకాంతులు!

'రాగిణీదీదీ' అని అప్రయత్నంగా నోటవరకూ వచ్చింది ఆ అందాలరాణి నా స్వంతసోదరే ఐనట్టు. కాని సిగ్గుతో అనలేక మెల్లగా మెట్లెక్కి దగ్గరకి వెళ్ళాను.

'ఎవరు? రాజా!'- రాజా అని ఆ మృదుకంఠంనించి వంకర్లు తిరుగుతూ వచ్చిన ఆఒక్క చిన్నమాట నన్ను వూపి కదలించింది. అవును. రాజాయే! నువ్వు ఆడించి ముద్దులాడే తమ్ముడక్కా.

కాని 'ఉఁ' అనలేకపోయాను. సన్నగా నవ్వుతున్న నా పెదవులు ఆ భావాన్ని వ్యక్తం చేశాయి.

'ఎంత పెద్దవాడవైపోయావ్, నిన్నసలు గుర్తించలేకపోయాను' అంది నన్ను ఆపాదమస్తకం పరీక్షిస్తూ.

నువ్వో? - అనేయాలనుకొన్నాను. కాని ఎందుకో అనలేకపోయాను.

'ఏంపని చేస్తున్నావ్ రాజా?'

'పపప్పరి!- డా డాక్టర్ పాసయ్యాను'. (అక్కాయ్ అని చివర్న చేర్చవలసిందే కాని అనలేకపోయాను నా తొట్రుపాటులో.)

'డాక్టర్! రా లోపలికి. నీ మేనల్లుడు మహా పెంకి ఐపోయాడు బాబు. నీ పేరు చెబితే 'ఎవడు వాడు?' అంటాడు కృష్ణలా' అంది నన్ను ఆహ్వానించడం కూడా మరచి, తన కొడుకుని పొగుడుకుంటూ.

'నేను కంసుడంత దుర్మార్గుణ్ణి కాదు. అయినా నన్నానవాలు పట్టగలడా?' కంఠం ఇప్పుడు స్థిరత్వాన్ని పొందుతోంది.

'నేను అనే మాటల్ని బట్టి గ్రహించాలేమో గాని- ఉండు పిలుస్తాను- గంగూ, గాంగునీ' అని గట్టిగా కేకేసింది, కోయిల కంఠమెత్తి ఆకాశాన్ని లాలిస్తూ పిలిచినట్టే.

బుడతడు వచ్చాడు. తల్లిమీదికి ఎగిరి పోయాడు. రాగిణి వాడిని దింపి నాదగ్గరకు తీసుకవచ్చింది.

'ఎవరో తెలుసా?' నన్ను చూపించింది.

తల అడ్డగా తెలీదన్నట్టు తిప్పాడు.

'నువ్వు చంపుతానసే వాడివే. ఆ కంస మావయ్య. నమస్కారం చెయ్యి' అంది నవ్వుతూ.

నమస్కారం చేశాడు. 'కాని ఎవరమ్మా?' అన్నాడు వాళ్ళభాషలో ముందెంతో తెలిసినట్టు నమస్కారం చేస్తూ, తర్వాత తెలీనట్టు.

'మావయ్య,

'మావయ్యా' అనుకొంటూ నామీదికి ఎగిరి వచ్చాడు. వాణ్ణి తలివిగీరా కౌగిలించుకొని ముద్దులాడాను. ఇప్పటికి ఆనవాలు కట్టినట్టున్నాడు. నాకిక స్నేహితుడై పోతాడు.

'లోపలికి రా, రాజా'

నౌఖర్ బెడ్డింగుతీసి లోపల పెట్టాడు. నేను బాబుని దింపి నడిపించుకొంటూ లోనికి అడుగు పెట్టాను. గోడలకివున్న ఫోటోలకేసి పోయింది నా దృష్టి.

'అందరూ క్షేమంగా వున్నారా?'

'జబ్బు చేసిరా నేను డాక్టర్నిగా' అన్నాను నవ్వుతూ.

'అవును నిన్నందుకే డాక్టరు చదివించారు. కాఫీ తీసుకో'

'వద్దు ఇప్పుడే హోటల్లో మెక్కి వస్తున్నాను.'

'అయితే మాయింటి కెందుకొచ్చావ్! అలా వెళ్ళిపోవలసింది'

'అప్పటికప్పుడు వచ్చి ప్రాణాలమీద కూచుంటే! ఇది, పాలు, పంచదారలు దొరకని బెజవాడని నేను మరచిపోలేదు.'

'మధ్యాహ్నం భోజనం కూడ వెంటబెట్టుకొని రావలసింది' అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

నేనో సోఫాలో కూచున్నాను. బాబు నా పక్కనే కూచొని తేరపార నన్ను చూస్తున్నాడు. కోటు విప్పడానికని నిలబడ్డాను. ఇంకా నా కేసే రెప్పవేయకుండా చూస్తున్నాడు గాంగునీ.

'నన్ను గుర్తుపట్టావా?' అన్నాను

'ఊఁ. మావయ్యవి' మీదికి ఉరికాడు.

కోటుతీసి పక్కనుంచి, వాడిని పట్టుకొని మళ్ళా సోఫాలో కూచున్నాను.

'నీ కెలా తెలుసు నేను మావయ్యనని?'

'అమ్మ చెప్పింది'

'అమ్మ ఇంకా ఏమని చెప్పింది?' అన్నాను ఆత్రుతగా.

'బొమ్మలు కొనిస్తానసేది, బట్టలు కుట్టిస్తానసేది - సైకిల్ కొంటానసేది. కాని యిప్పటి వరకూ—' వాడి గొడవ వాడిదే!

'అదికాదు. నామీద?'

'అంతే ఇంకేమీ లేదు. కాని ఇప్పటివరకూ అమ్మ సైకిల్ కొని యివ్వలేదు. నువ్వు కొని పెట్టవూ మావయ్యా?

'సరే కొనిస్తాను. మరింకేమీ చెప్పలేదూ. రాజా మావయ్య డాక్టరు చదువుతున్నాడనీ, మావయ్య కథలు రాస్తాడని—'

'ఊహూ. అదేమీ చెప్పేదికాదు నాకుసైకిల్'

రాగిణి ట్రేలో కాఫీ,రొట్టెలు తెచ్చి రౌండ్ టేబిల్ మీద వుంచింది. ఓ కప్పు నాకందించి రొట్టె తీసుకోమంది. నేనెంత ఆటంక పరుస్తున్నా ఒప్పుకొంది కాదు. సరే అని నేనూ, బాబు పంచుకొని తిని, బట్టలు మార్చుకుని బజారుకి బయలు దేరాం.

'రేపనని హోటల్లో భోంచెయ్యకేం రాజా' అంది నేను వెళ్ళేప్పుడు.

'సరే' అన్నాను

బజారులో గాంగుసీకి చిన్న సైకిలు కొన్నాను. ఇంటికి తిరిగి వెళ్ళేసరికి గోవిందదాసు కూడా వున్నారు. నన్ను చూసి ఎంతో ముచ్చటపడి ఆదరించారు.

భోజనాల దగ్గర కూచున్నప్పుడు రాగిణి వడ్డిస్తూ అంది: 'డబ్బు ఎంత తెచ్చావేంటి రాజా' అని.

రాగిణి దీదీ కేసి తలెత్తి చూసి తేలికగా నవ్వేసరికి, ఆమె కంఠంలో తీవ్రంగా కదిలి అక్కడే గిలగిలమన్న బాదృష్టికి కాస్త నెమ్మది చేకూరింది.

'గంగూకి సైకిలెందుకు కొన్నావ్?'

'నా మేనల్లుడు గాబట్టి'

గోవిందదాస్ నవ్వారు. 'అయితే అతనితో మేం వేగలేకపోతున్నాం. నీ వెంట తీసుకపోదూ' అన్నాడు.

తలూపేను నవ్వుతూ. మీరు ఒప్పుకొన్నా రాగిణి ఒప్పుకోవద్దూ, అన్నట్టు రాగిణి కేసి చూశాను

మధ్యాహ్నం గోవిందదాస్ నన్ను తనతో బాటు తన షాపుకి తీసుక వెళ్ళారు. షాపులో అన్నివస్తువులూ చూపించారు. యుద్ధం వల్ల సరుకు మంచిది దిగుమతి అవడం లేదన్నారు. ఇంకా ఏవేవో చెప్పారు. అక్కడికి వచ్చిన అందరితో పరిచయం చేశారు. సాయంకాలం నాలుగు కాగానే ఇద్దరం తిరిగి ఇంటికి వచ్చాం, సినీమాకి వెళ్ళాలని.

ఇంటికి రాగానే రాగిణిదీదీ చేసిన జిలేబీ, పకోడీలు తిని, సేమ్యాలు తాగి సినీమాకి బయలు దేరాం. ఏదో తలనొప్పి పిక్చరు!

ఆట పదికి వొదిలారు. ఇంటికి వచ్చేసరికి పదిన్నర. బాబు సినిమా హాల్లోనే నిద్ర పోయాడు.

భోంచేసిన తర్వాత, నేనూ గోవిందదాసు ఆరుబయట వెన్నెల్లో పడుకొన్నాం. రాగిణి ఇంట్లో పడుకొంది. అవతల మంచంమీద గాంగుసీ మంచి నిద్రలో వున్నాడు.

పక్కమీద దొర్లుతున్నాను చందమామ నించి సన్నని రాగాలు వినిపిస్తున్నాయ్. ఏవో పూహాలు పుడుతూ కెరటల్లా దొర్లుతున్నాయ్. అవి ఏమిటో గుర్తు పట్టలేక పోతున్నాను. మంచులా మాయమవుతున్నాయి.

రాగిణి దీదీ ముఖం, ఆ చల్లని వెన్నెట్లో చల్లగా, సన్నగా నవ్వుతోంది. కళ్ళు మూతలు పడటంలేదు ఆశలని రేపే ఆ విద్యుత్కాంతిలో.

కలత పెడుతున్న ఆ దీదీ ముఖమే నా ముందు ప్రత్యక్షం అవుతోంది. చిన్నతనంలో దీదీ చూపించిన వాత్సల్యంలో, ఆదరింపులో ఏమీ మార్పు లేదు. ఇప్పుడూ అలానే ఆదరించింది. మొదట ఆమెను చూడగానే నా కళ్లల్లో సిగ్గుతెరలు దొంతర్లయాయి. కానిరెండుమాటలు ఆమెయించి వినగానే, నా చిన్నతనపు రాగిణీ దీదీ జ్ఞాపకానికి వచ్చింది. అమాంతంగా ఆమెను కౌగలించుకోవాలనుకున్నాను. కాని నేను చిన్న వాడిని కాను!

ప్రొద్దుట బజారుకి వెళ్ళిపోయాను అక్కతో మాటాడకుండా. మధ్యాహ్నం గోవిందదాస్ తీసుకపోయాడు షాపుకి. రాత్రికయినా వెన్నెట్లో సరదాగా మాటాడుదామనుకొంటే ఈ సినిమా. ఇక ఇప్పుడు ఇది.

కాస్త తల పక్కకి తిప్పి చూశాను గోవిందదాసు నిద్రపోయారేమోనని. కాని నిద్రపోక పోతే! మళ్ళా తల తిప్పుకొన్నాను. గుండె దడ దడ మంటోంది. భాషని నేర్చిన కాల్కు, భావాలని రేపే హృదయం, అందాలని తనివిదీరా అనుభవించే లోచనాలు తొందరపడుతూ నన్ను పూపి, ఉసికొల్పుతున్నాయి. అలానే లెక్కపెట్టాను పన్నెండుని.

గభుక్కున లేచాను ఏమైనా సరేనని. ఆ లేవడం దూకుడుగా అని నేననుకున్నా, నా శరీరం మెల్లగానే లేచింది. గొంతుక మెలికలు తిరిగింది. రక్తం 'ఝుం'మంది. కాళ్ళు ధైర్యంగా లేవు. ఊచల్లా వొణికి పోతున్నాయి. కళ్ళ ముందు నీటి చక్రాలు సుళ్లు తిరిగాయి. అయినా ధైర్యంగా చొరవ చేసుకొని రాగిణి గదిలోకి వెళ్ళాను. ఎందుకో నాకే తెలీదు.

ఆ గదిలో ఒకమూల నీలి దీపం. దానిలో విద్యుత్ తరంగాలు. పై రంగుని ఛేదించలేక లోలోనే గిలగిల తన్నుకొంటున్నాయి. ఆ లేనీలి కాంతిలో రాగిణి ముఖం ఇంద్ర ధనస్సుని జ్ఞప్తికి తెచ్చింది. మూసిన కళ్ళలోని సన్నని-

కాలాంజన రేఖ విలాస సరస్వతి వీణా తంత్రువుని స్ఫురణకు తెచ్చింది. ఆమె శ్వాసలో, ఊపిరిలో, సమక్షంలో నేనూ ఒకణ్ణయిపోవాలనుకున్నాను.

ఎదురుగా మైకంలో వున్న స్త్రీ నా చిన్నతనపు రాగిణి దీదీ. ఆమె వెళ్ళిపోతున్నపుడు నేను చాలా విచారించాను. ఎందుకో తెలీదు. ఇప్పుడు దగ్గరగా చేరుకొన్నాను - నడిరేయిలో ఒంటరిగా, ఒక్క నీలిదీపపు సాక్ష్యంతో. అయినా ఎందుకో తెలీదు.

చాల దగ్గరగా వెళ్లాను ఆముఖాన్ని చూడగానే వొళ్ళు ఝల్లుమంది. ఫాలంమీద చిన్న చెమట పొడచూపుతోంది. రక్తంచల్లబడి గుండెదడ తీవ్రమయింది. చెవుల్లో శంఖారావాలు. గొంతుకలో మంట. కనురెప్పల్లో నిశ్చలత.

ముఖం నించి వక్షాలమీదుగా, ఆమెపాదాల మీదికి దొర్లింది నా దృష్టి. ఆమె మీద అమాంతంగా పడి 'రాగిణీ అక్కాయ్' అని కాళ్లల్లో తల పెట్టేయాలనుకొన్నాను.

కాని నేనందుకలా కాంక్షిస్తున్నాను. నాలో వెల్లువలవుతున్న పొంగు ఏమిటి? ఆమెనించి నాకేం కావాలి? ఆమెను చేరుతూంటే శ్వాస కంగారు పడుతూ, స్వేద రంధ్రాలెందుకు ఉబ్బుతున్నాయి?

•

అదే కారణమా నేను రాజమండ్రినించి యిక్కడికి రావడానికి?

'నువ్విప్పుడు యుక్తాయుక్తాలని తరచి చూచే వయసులో లేవు.' ఫూత్కరింపు లా ప్రకాశం మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

తలెత్తి పైకి చూశాను. నీలి దీపంలో విద్యుత్తు నన్ను ఉద్రిక్తపరుస్తోంది. కిందికి చూశాను. గొప్ప అప్సరస. చేతుల్లో రాగిణి. సన్నని ఉల్లాభంతో సుందరి.

'రాగిణిని చూడగానే నువ్వే వయసులో అక్కలా చూడలేవు. నీలో అదోవిధమైన సంచలనం బయలుదేరుతుంది. దాన్ని నువ్వు తర్కించుకోలేవు. గుర్తు పట్టలేవు. వ్యక్తపరచలేవు' నల్లని గడ్డాల్లోంచి, వక్రాలని దొర్లిస్తున్నట్టు అనిపించింది ప్రకాశం మాటలు.

చల్లని గాలులకి చిరునృత్యాలు చేస్తున్న ఆమె ఫాలంమీదికైశికాలు నన్ను నులిపివేస్తున్నాయి.

అవును నేను రాగిణిని ప్రేమిస్తున్నాను: అ-క్క-గా.

అంటే? అక్కంటే? అయితే ఆ అక్కనించి నే నిప్పుడు కోరే దేమిటి?

'వాత్సల్యం-ప్రేమ-మోహం ఒక్క హృదయంనించి పుట్టినవే' మహాజ్ఞానిలా అన్నాడు- అవే గర్జిస్తున్నట్టు వినిపిస్తున్నాయి.

అయితే రాగిణి దీదీలో నన్నింతగా కలవరపరచే దేమిటి? నిజంగా నా హృదయం ఆమెని ప్రేయసిలా కాంక్షిస్తోందా?

కాదు, కాదు-అక్క-రాగిణి నా అక్క. నా రక్తాన్ని పంచుకొని నా తల్లి గర్భంనించి పుట్టిన తోబుట్టువు.

నా హృదయం ఒప్పుకోవటం లేదు. నా అంతరంగం నన్ను దూషిస్తోంది. హృదయం ఆమెని కాంక్షిస్తోంది. అంతరంగం వొద్దు ఆమెను ప్రేమించు అక్కలా అంటోంది.

తల తిరిగిపోతోంది. ఆమెలోకే తీక్షణంగా చూశాను. ఆమె ఒక తల్లి ఆమెపక్కనే, నా 'మేనల్లుడు'- నా 'మేనల్లుడు'- ఆమె నా సోదరి. పైజాతి స్త్రీ అయితేనేం నాకు దీదీ. అంతే! ఆమెను చూస్తే దుర్బలహృదయం చప్పరిస్తోంది. ఎంత దుర్బలుడివిరా! ఛీత్కరిస్తోంది అంతరంగం.

ఆమె కాళ్ళమీద పడి 'అక్కాయ్, ఇలాంటి మూర్ఖుణ్ణి, నీచుణ్ణి, దుర్బలుణ్ణి, నీ తమ్ముడిగా ఎంచుకొన్నావేం?' అని పీకనరికి ఆ నెత్తురుతో కసి తీర్చుకోవాలనుకొన్నాను.

కాని ఈ కళ్లల్లో వ్యామోహం, హృదయంలో దౌర్బల్యం ఆమెకేసి చూస్తోంటే నాకు దుర్బోధలు చేస్తున్నాయి.

నేను యూనివర్సిటీలో వైద్యశాస్త్రంలో మొదటివాడిగా పాసయాను. ఎందుకు? దుర్బలుణ్ణి. నేను గొప్ప డాక్టర్నే-ఎందుకు. నా హృదయం విషం అయితే.

ఇక అక్కడుండకూడదు. బండెక్కాను- దూరం, దూరం, ఎంతో దూరం వెళ్ళిపోయాను- నాస్వంత హృదయదౌర్బల్యాన్ని జయించలేక, సుందరాంగి రాగిణీ అక్కని వారించి, నా పవిత్ర అంతరంగంనించి, పూర్తిగా తుడిచి వేయాలని.